గంజాయి విక్రేత అరెస్ట్

సైదాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకాలు సాగిస్తున్న ఓ వ్యక్తిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి 141 గ్రాముల గంజాయి, రూ.8,150 నగదు, ఫోన్, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షంరాజ్ ఉన్ రహమాన్(24) తండ్రి కొద్ది నెలల క్రితం మృతిచెందడంతో ఓవైసీ నగర్‌లోని స్నేహితుడైన పర్వేజ్ నుంచి మూడుసార్లు గంజాయి కొనుగోలు చేసి.. తర్వాత తానే విక్రేతగా మారాడు. పర్వేజ్ నుంచి గంజాయి కొని సింగరేణి కాలనీ, దోబీఘాట్, ఫిసల్‌బండ ప్రాంతాలలో పలువురికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సైదాబాద్ పోలీసులు శుక్రవారం బైక్‌పై గంజాయి తీసుకెళ్తున్న రహమాన్‌ను మాటువేసి పట్టుకొని తనిఖీ చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

క్యూ ఆర్ కోడ్ పంపి రూ.83వేలు దోచుకున్నారు..

కొత్తపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఓ మహిళకు క్యూ ఆర్ కోడ్ పంపి సైబర్ మోసగాళ్లు రూ 83,415 దోచుకున్నారు. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం... మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలో ఉండే లక్ష్మీచందన విద్యార్థిని. ఈ నెల 1న ఆమె ఆన్‌లైన్ షాపింగ్ సైట్ మింత్రాలో కుర్తా కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చింది. 4వ తేదీన గుర్తు తెలియని మహిళ 8981641191 నంబర్ నుంచి ఆమెకు కాల్ చేసి తాను మింత్రా ఎగ్జిక్యూటివ్‌నని పరిచయం చేసుకుంది. కుర్తా డెలివరీ చేసేందుకు డబ్బు చెల్లించే ఆప్షన్ యాక్టివేట్ చేయలేదని, మరో నంబర్ నుంచి లక్ష్మీచందనకు క్యూ ఆర్‌కోడ్ పంపింది. లక్ష్మీచందన క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆమెకు రూ.1519.50 చెల్లించింది. ఆ తర్వాత ఖాతా నుంచి పలు విడతలుగా మొత్తం రూ.83,415 ఇతర ఖాతాల్లోకి బదిలీ అయ్యాయి. వెంటనే తాను మోసపోయినట్లు గ్రహించి ఆమె సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెం 1930 ద్వారా ఫిర్యాదు చేసింది. బాధితురాలు శుక్రవారం ఎల్బీనగర్ పీఎస్‌లోనూ ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన కార్లు

హయత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఒకదానితో ఒక టి ఢీ కొని ఇద్దరు వ్యక్తులు గాయాలకు గురైన ఘటన హయత్‌నగర్ పీఎస్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం గుర్తు తెలియని రెండు కార్లు హయత్‌నగర్ నుంచి విజయవాడ వైపుకు వేగంగా వెళుతున్నాయి. లక్ష్మారెడ్డి పాలెం వద్ద గల హనుమాన్ ఆలయం వద్దకు చేరుకోగానే ముందున్న కారును వెనుక వస్తున్న కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కారులో ఉన్న ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. బెలూన్లు తెరుచుకోవడంతో వారు ప్రాణాలతో బయట పడ్డారు. ముందు కారులోభార్య భర్తలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంత వరకు ఎవరూ ఫిర్యాదు చేయక పోవడంతో వారి వివరాలు తెలియలేదని సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యకు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి, తదితరులు

వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

హయత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రాంతాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు చాలా గ్రామాల్లో వరి ధాన్యం, పత్తి తడిసిందని గుర్తు చేశారు. నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలని కోరారు. కోహెడలో నిర్మించ తలపెట్టిన పండ్ల మార్కెట్‌ను త్వరగా నిర్మించాలని కోరారు.



ఐఎస్ సదన్ చౌరస్తాలో ధర్నాచేస్తున్న బీజేపీ నేతలు

ఆలయాల వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలి : బీజేపీ


సైదాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ చౌరస్తాలో శివాలయం హుండీ చోరీకి పాల్పడిన ఆగంతకులను గుర్తించి పట్టుకుని కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో బీజేపీ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారెడ్డి, జంగం శ్వేతా రెడ్డిలు మాట్లాడుతూ సీసీ ఫుటేజీలో దొంగలను గుర్తించిన ఇంతవరకు అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. ముఖ్యంగా పాతబస్తీలో వరుసగా జరుగుతున్న ఘటనలు దృష్ట్యా ఆలయాల వద్ద పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి, అధికార ప్రతినిధి వీరేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నేతలు అమర్నాథ్ రెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


అరుణోదయనగర్ కాలనీలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు : కళ్లెం

హయత్‌నగర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ అరుణోదయనగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని పలువురు కాలనీ వాసులు కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన శుక్రవారం ఉదయం కాలనీని సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేదిలేదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సిబ్బంది చక్కగా పనిచేసి చెత్త, వ్యర్థాలను తొలగించాలని కోరారు. మరోసారి ఫిర్యాదు వస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

చిత్రం.. గీసి



నేడు (శనివారం) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎల్బీనగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ నాగార్జునప రాము ఇసుకతో వినూత్నంగా సీఎం చిత్రాన్ని గీసి అభిమానాన్ని చాటుకున్నాడు.

- మన్సూరాబాద్, ఆంధ్రజ్యోతి


మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన చేస్తున్న కమిషనర్ నాగమణి, ఏఎంసీ


ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న సిబ్బంది


బాటసింగారం ప్రాథమిక పాఠశాలలో గీతాలాపన చేస్తున్న విద్యార్థులు



చాదర్‌ఘాట్ పీఎస్‌లో సిబ్బందితో కలిసి వందే మాతరం గీతాన్ని ఆలపిస్తున్న ఇన్‌స్పెక్టర్ మురారీ

150 వసంతాల 'వందేమాతరం'

- పాఠశాలలు, కార్యాలయాల్లో సామూహిక గీతం ఆలపించిన విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు

ఎల్బీనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయానికి 150 ఏళ్లయిన సందర్భంగా ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఅవుట్‌కాలనీ చిల్డ్రన్స్ పార్కు ఆవరణలో శుక్రవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వందేమాతరం సామూహిక గీతాలాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కాలనీ అసోసియేషన్, వాకర్స్ క్లబ్ సభ్యులంతా వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

మీర్‌పేట్ ఆఫీస్‌లో..

సరూర్‌నగర్, (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో సామూహిక గీతాలాపన ఆలపించారు. కమిషనర్ నాగమణి, ఏఎంసీ ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు కలిసి ఆలపించారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్, (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు సామూహిక గీతాలాపన చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులందరు కలిసి గీతాన్ని ఆలపించారు. హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ, శాంతినికేతన్ టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు వందేమాతరం ఆలపించారు.


హయత్‌నగర్ శాంతినికేతన్ టాలెంట్ స్కూల్‌లో సామూహిక గీతాలాపన

సౌత్ ఎండ్‌పార్కుకాలనీలో..

మన్సూరాబాద్, (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని సౌత్ ఎండ్‌పార్కుకాలనీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గీతాలాపన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి స్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ ప్రాంగణంలో..

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ ప్రాంగణంలో పోలీసులతో కలిసి ఏసీపీ కృష్ణయ్య వందేమాతరం ఆలపించారు. కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లోనూ విద్యార్థులు, టీచర్లు ఈ ఐక్యతా గీతాన్ని పాడారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

హయత్‌నగర్, (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సామూహిక గానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోల్‌కత్తా రవీంద్రభారతి యూనివర్సిటీ ప్రొఫెసర్ హితేంద్రకుమార్ పటేల్, సిథోకన్హా బిర్హా యూనివర్సిటీకి చెందిన నందితా బెనర్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతుల మధ్య ఉన్న కళాత్మక, చారిత్రక, మానసిక అనుబంధాలను వారు వివరించారు.


మలక్‌పేట ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో..


మన్సూరాబాద్ హైస్కూల్‌లో గీతాలాపన చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి


కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఎల్బీనగర్ పీఎస్‌లో గీతాన్ని ఆలపిస్తున్న ఏసీపీ కృష్ణయ్య, సిబ్బంది

ఇంటింటా ఎన్నికల ప్రచారం


సోమాజిగూడ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్

చంపాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం సోమాజిగూడ డివిజన్‌లో టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నాయకత్వంలో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, పార్టీతోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉన్నా.. పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికి కొత్త రేషన్ కార్డులను సన్నబియ్యంతో అందించిందన్నారు.


రెహ్మత్‌నగర్ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న జైపాల్‌రెడ్డి తదితరులు

జూబ్లీహిల్స్‌లో పెద్దఅంబర్‌పేట్ నాయకులు..

అబ్దుల్లాపూర్‌మెట్, (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం ఆ పార్టీ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని రెహ్మత్‌నగర్ డివిజన్ 185వ బూత్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేసి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

48 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు.. కుటుంబానికి నష్టం కలిగించవద్దని నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించే వీలుందని అల్కాపురి చౌరస్తా సమీపంలో గల ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి, ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి వివరించారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 48 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు, లెక్చర్‌హాల్‌లో 4 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాల తనిఖీలు వాహనదారుల భద్రత కోసమేనని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి మద్యం మత్తు అనర్థాలపై సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.

కోర్టుల చుట్టూ తిరగొద్దు..

ఏఎంసీ ని కలవండి : జ్యోతిరావు


జ్యోతిరావు,ఏఎంసీ అధ్యక్షురాలు

మన్సూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలే గానీ, ప్రాణాంతకమవ్వొద్దని అమిక మధ్యవర్తిత్వ కేంద్ర(ఏఎంసీ) అధ్యక్షురాలు జ్యోతిరావు అన్నారు. వనస్థలిపురంలోని ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, ఆస్తి కోసం అన్నదమ్ములు, తల్లిదండ్రులు వారి సంతానం, బంధువులు తగాదాలు పడుతుంటారని, భార్యాభర్తల నడుమ, వివాహ సంబంధం వంటి మరెన్నో కేసులు చూస్తున్నామన్నారు. ఇలాంటి కేసుల పరిష్కారానికి బాధితులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారన్నారు. వాటన్నింటిని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించేందుకు తమ కేంద్రం పనిచేస్తోందన్నారు. కేసులు పరిష్కారంకాని వారు సెల్: 9676875789, 7780404033 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

కార్మికుల సమస్యలపై గళమెత్తుతాం: సీఐటీయూ

సరూర్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం గళమెత్తుతుందని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ కృషి చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ అన్నారు. శుక్రవారం మీర్‌పేట్‌లో నిర్వహించిన సీఐటీయూ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసేది సీఐటీయూ ఒక్కటేనని అన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో రాజేంద్రనగర్‌లోని కాటేదాన్ లో గల సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్యవర్గాలు ఎన్నిక

సీఐటీయూ మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యవర్గాలను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మీర్‌పేట్ కన్వీనర్‌గా దాసరి బాబు, సభ్యులుగా యాదగిరిచారి, కిషన్ , వెంకయ్య, విజయ్, రమేశ్ ,మాధవరెడ్డి, సత్యం, మోహన్, వేణు, యాదయ్య, జగన్, భారతమ్మ, భాగ్యలక్ష్మి తదితరులను ఎన్నుకున్నట్లు రుద్రకుమార్ తెలిపారు.

కమ్యూనిటీహాల్ అదనపు నిర్మాణ పనులకు భూమిపూజ


నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి

చంపాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని డిఫెన్స్‌కాలనీలో కమ్యూనిటీహాల్ అదనపు నిర్మాణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ నిధులు రూ.40లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్ అదనపు నిర్మాణ పనులను చేపట్టనున్నామన్నారు.

చంపాపేట డివిజన్ లోని అన్ని కాలనీలు, బస్తీలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఇంకా మిగిలిపోయిన పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేక సురేందర్‌రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణం

మన్సూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా స్టేట్స్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం సహారా స్టేట్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఫోరం అధ్యక్షుడిగా నూకల ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రసాదరావు, ప్రధానకార్యదర్శిగా డాక్టర్ ఆర్ఎస్ ప్రకాశం, కోశాధికారిగా శ్యాంప్రసాద్‌ముదిరాజ్, సంయుక్తకార్యదర్శిగా అమర్నాథ్, కార్యవర్గ సభ్యులుగా రామన్ గౌడ్, వీరభద్రరావు ఎన్నిక కాగా వారిచే గంగదాసు కృష్ణారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల అవగాహన, సూచనలు ఎంతో ముఖ్యమని, నేటి సమాజానికి దిక్సూచి సీనియర్ సిటిజన్లేనన్నారు. ఈ కార్యక్రమంలో సహారాస్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, ప్రధానకార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి శేఖరయ్య, మాజీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ , సహారా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, చైర్మన్ ఓపీ సింగ్, సీనియర్ సిటిజన్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, విశ్వనాథ్, వెంకటాద్రి, పెంటయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆస్పత్రి సిబ్బందిపై కత్తితో దాడి

- ఇద్దరు నిందితులకు రిమాండ్.. పరారీలో మరో ఇద్దరు

వనస్థలిపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి సమీపంలో మద్యం తాగొద్దనందుకు ఆసుపత్రి సిబ్బందిపై కత్తితో దాడిచేసి గాయపర్చిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వనస్థలిపురం డివిజన్ యశోధరనగర్ కాలనీలోని జెమ్ కిడ్నీ ఆసుపత్రి సమీపంలో గురువారం రాత్రి గుంటి జంగయ్యనగర్ కాలనీకి చెందిన రితేష్(21), మణిశంకర్, ప్రవీణ్, అభిరాములు మద్యం తాగుతున్నారు. రాత్రి కావడంతో ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆసుపత్రి సిబ్బంది విద్యాసాగర్, వేణుగోపాల్, సదరు యువకులు చెప్పారు. దీంతో పూటుగా తాగిన యువకులు సదరు ఆసుపత్రి సిబ్బందిపై దాడిచేశారు. అంతటితో ఆగకుండా రితేష్ తన వద్ద ఉన్న కత్తితో విద్యాసాగర్ కడుపులో పొడిచి గాయపర్చారు. మరో సిబ్బంది వేణుగోపాల్‌ను కొట్టి పరారయ్యారు. ఆసుపత్రి నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కత్తిపోట్లకు పాల్పడిన రితేష్, మణిశంకర్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ప్రవీణ్, అభిరామ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

సైదాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకాలు సాగిస్తున్న ఓ వ్యక్తిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి 141 గ్రాముల గంజాయి, రూ.8,150 నగదు, ఫోన్, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షంరాజ్ ఉన్ రహమాన్(24) తండ్రి కొద్ది నెలల క్రితం మృతిచెందడంతో ఓవైసీ నగర్‌లోని స్నేహితుడైన పర్వేజ్ నుంచి మూడుసార్లు గంజాయి కొని తర్వాత తానే విక్రేతగా మారాడు. పర్వేజ్ నుంచి గంజాయి కొని సింగరేణి కాలనీ, దోబీఘాట్, ఫిసల్‌బండ ప్రాంతాలలో పలువురికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. సైదాబాద్ పోలీసులు శుక్రవారం బైక్‌పై గంజాయి తీసుకెళ్తున్న రహమాన్‌ను మాటువేసి పట్టుకొని తనిఖీ చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు.